

# జాలి కాదు

శీలా సుభద్రాదేవి

"ఈ అడవిలో ఒంటరిగా చిక్కుకున్నా నేమిటి బాబూ" అనుకుంటూ ఇబ్బందిగా కూచున్నచోటే అటూ ఇటూ కదిలాను.

అసలు నాకు ఇలాంటి పెళ్ళిళ్ళకి, పేరంటాలకీ వెళ్ళాలంటేనే చికాకు. పాతికేళ్ళు దాటినా యింకా పెళ్ళి కాలేదేమిటని బుగ్గలు నొక్కుకుంటూ పరామర్శించటం, సానుభూతి చూపటం చేస్తారు కొంత మంది అమ్మలక్కలు. అక్కడికి నేను పెళ్ళిచేసుకోనంత మాత్రాన వాళ్ళకొంపేదో మునిగిపోయినట్లు ప్రవర్తించే వాళ్ళని చూస్తే నాకు అరికాలిమంట నెత్తికెక్కుతాది. అందుకే ఎంతో తప్పనిసరి అయితేనే తప్ప ఇటువంటి వాటికి వెళ్ళటానికి యిష్టపడను.

సరోజినికి కోపం వస్తుందేమో నని రాక తప్పలేదు. అదీగాక సెలవురోజు కావటం మరీ తప్పించుకోవటానికి వీల్లేక పోయింది. రెండు నెలలక్రితం ఉద్యోగంలో చేరిన కొత్తలో అనుకుంటాను వీళ్ళింటికి మొదటిసారివచ్చాను. వీళ్ళింట్లో ఎవరితోనూ పరిచయంలేదు. సరోజినితోనైతే రోజంతా కలిసే ఉండటం వలన స్నేహం ఏర్పడింది. ఇప్పుడు ఆవిడ కాస్తా పెళ్ళికూతురాయె!